క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు విన్నకోట సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 6.30 నుంచి ప్రారంభించే ఈ పరీక్షలకు హాజరయ్యే వారు ఎటువంటి ఆహారం తీసుకోకుండా రావాలన్నారు. వివరాలకు 98664 11346 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

రోడ్లపైనే పశువులు



రోడ్లపై తిరుగుతున్న పశువులు

పెద్దాపురం: నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై పశువులు తిష్ట వేస్తున్నాయి. అసలే ఇరుకు రోడ్లు, ఆపై రహదారులపై పశువులు ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పరిస్థితిని చక్కదిద్దాల్సిన పోలీసులు, మున్సిపల్, పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో పాడి గేదెలు రోడ్లపై పాగా వేయడంతో చాలా మంది రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. పట్టణానికి చేరుకునే జగ్గంపేట రహదారి, రాయభూపాలపట్నం నుంచి పట్టణానికి వచ్చే రోడ్డు, వడ్లమూరు రోడ్డులో పశువులు ఎప్పుడు రోడ్డుపైనే ఉంటాయి. అవి పక్కకు తప్పుకోవు. వాటిని తప్పించే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆయా ప్రాంత పరిధిలోని పశువుల పోషకులు నిర్లక్ష్యానికి చాలా మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగే పిచ్చితుప్పలు, పచ్చగడ్డి, రహదారులను ఆనుకుని ఉన్న పోస్టర్లను తినేందుకు పశువులు రహదారులపై సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల పెంపకం దారులు తమ పశువులను కట్టడి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

సామర్లకోట: జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. ఈ కేంద్రంలో 159 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 117 మంది మాత్రమే హాజరయ్యారని, 42 మంది గైర్హాజరు అయ్యారని పాఠశాల హెచ్ఎం యు.మీనామాధురి తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కాకినాడ రూరల్: నియోజకవర్గ పరిధిలో పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సత్యనారాయణ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కాకినాడ రూరల్, కరప, అర్బన్‌లోని రూరల్ డివిజన్ల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే వివిధ దశల్లో ఉన్న గృహాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు నెలాఖరులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలని కోరారు. మార్చి నెలాఖరు నాటికి ప్రారంభించిన గృహాలు పూర్తవ్వాలని లక్ష్యం సాధించే వారికి ప్రోత్సాహకం ఉంటుందన్నారు. సమావేశంలో హౌసింగ్ స్పెషలాఫీసరు సత్యవతి, ఈఈ వై.శ్రీనివాసరావు, ఏఈ నాగభూషణరావు, కరప ఎంపీడీఓ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి



సామర్లకోటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

సామర్లకోట: రాష్ట్రంలో పేద ప్రజల కోసం సంక్షేమానికి బాట వేసిన నేత దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని, దాంతో ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక మఠంసెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. లారీ స్టాండ్ పార్కు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రకృతి సేద్యం.. ఫలితం అద్భుతం

- సేంద్రియంతోనే ఆరోగ్యకర పంటలు
- తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడి
- ఆసక్తి కనబరుస్తున్న అన్నదాతలు
- 598 ఎకరాలకు విస్తరించిన సేంద్రియ సాగు



గోరింట గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న వరి పంట (ఫైల్)



జీవామృతం తయారు చేస్తున్న రైతులు

పెద్దాపురం: అన్నదాతలుప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం, ఆరోగ్యకర పంటలు లభిస్తుండడం, మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో సేంద్రియ సాగునే చేస్తున్నారు. మనం తినే ఆహార పదార్థాలు రసాయనాలు, పురుగుల మందులతో నిండిపోతే అది మన శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. విచ్చలవిడి రసాయనాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు అంతా ఇంతా కాదు. పైగా పురుగు మందుల భారమే అన్నదాతను నిలువునా ముంచుతోంది. అందుకే ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడితో పెద్దాపురం మండల రైతాంగం ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధిస్తున్నారు.

బ్రహ్మాస్త్రం తయారీ విధానం, లాభాలు

వేప, సీతాఫలం, గానుగ, ఉమ్మెత్త, ఆముదం ఆకులను 20 లీటర్ల ఆవు మూత్రంలో ఉడికించి చేసే కషాయాన్ని 'బ్రహ్మాస్త్రం' అని పిలుస్తారు. ఈకషాయంను పైరుపై పిచికారీ చేయాలి. తద్వారా పంటను ఆశించే పెద్ద పురుగులు నశించిపోతాయి.

నీమాస్త్రం

ఎరువు తయారీకి ముందుగా 200 లీటర్ల నీటిలో పది లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల ఆవుపేడ, 10 కిలోల వేపాకులు కలిపి రెండు రోజులు (48 గంటలు) నానబెట్టాలి. ఇలా వచ్చిన (నీమాస్త్రం) మిశ్రమాన్ని మూడో రోజు వడబోసి పంటలపై పిచికారీ చేయాలి. ఫలితంగా పంటలను ఆశించిన తెగుళ్ల (రసం పీల్చే పురుగులు)లను సమూలంగా నిర్మూలించవచ్చు. ఈమూడింటి (ఆవు మూత్రం, ఆవుపేడ, వేపాకులు)ని పది రోజులకొకసారి ఇలా పిచికారీ చేస్తే పైరు ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడి సాధించవచ్చు.

జీవామృతం తయారీ

ముందుగా 200 లీటర్ల నీటిలో పది లీటర్ల ఆవు మూత్రం, పది కిలోల ఆవుపేడ, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల పప్పు దినుసుల పిండి, పిడికెడు పుట్టమట్టి కలిపి రెండు రోజుల (48 గంటలు) పాటు నానబెట్టి, దాన్ని వడపోయాలి. ఇలా వచ్చిన జీవామృతాన్ని నీటి ద్వారా పైరుకు పారనివ్వాలి. తద్వారా భూసారం పెరుగుతుంది. ప్రకృతి సేద్యం ద్వారా కేవలం రూ.500 నుంచి రూ. 700 లోపు పెట్టుబడితో ఎకరా వరి పొలంలో 25 నుంచి 30 బస్తాల దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు.

అజొల్లా మదర్ పిట్

నీరు నిల్వ ఉండేలా చతురస్రాకారంలో గుంత తవ్వి పేడ, బెల్లం నీటితో కలిపి వారం రోజుల పాటు నిల్వ ఉంచాలి. దీంతో 'అజొల్లా' ఎరువు తయారవుతుంది. దీన్ని యూరియాకు ప్రత్యమ్నాయంగా వాడుకోవచ్చు. ఇది ప్రధానంగా కలుపు నివారణకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 8 కేజీల అజొల్లాను వేయాలి. అలాగే చేపల పెంపకం, పాలశాతం పెంచేందుకు రోజుకు పది గ్రామాల వంతున పశువులకు మేతగా వేయవచ్చు.

ఖర్చు తక్కువే..

ప్రకృతి సేద్యంపై మొగ్గు చూపుతున్న రైతులు వ్యవసాయ రంగంలో పెను మార్పులు తీసుకొస్తున్నారు. సులభ పద్ధతిలో ఎరువులను తయారు చేసుకుని, ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అధిక దిగుబడితో పాటు మంచి లాభాలను గడిస్తున్నారు. రసాయన ఎరువులు పెరగడం, వాటి వల్ల లాభాలు లేకపోవడంతో ఈ విధానంపై చాలా మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన సేంద్రియ సాగు

మండలంలో గత ఏడాది రెండు, మూడు గ్రామాల్లోనే సేంద్రియ సాగు జరిగింది. తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు రావడంతో రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు. గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామాల్లో 598 ఎకరాల మేర సేంద్రియ సాగు విస్తరించింది. సుమారు 1200 మంది రైతులు వరి సాగు చేపట్టారు.

ఆరోగ్యకర దిగుబడి



సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ. 10 వేలు పెట్టుబడితో రసాయన ఎరువులు వినియోగించి పంట సాగు చేసే పొలాన్ని ప్రకృతి సేద్యం ద్వారా రూ.వెయ్యితో పండించవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడి వస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను వాడడం వల్ల ఆరోగ్యం కూడా బావుంటుంది.

– కోన రామకోటేశ్వరరావు, సేంద్రియ సాగు రైతు, గోరింట, పెద్దాపురం మండలం

మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుంది



ప్రతి మొక్క పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం . రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే సూక్ష్మపోషకాలు సమృద్ధిగా అందుతాయి. నాణ్యమైన పంట అందుతుంది. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అందుకే రైతులు ప్రకతి సేద్యంపై దృష్టి సారించాలి.

– సంజయ్‌కుమార్, మండల వ్యవసాయశాఖాధికారి, పెద్దాపురం



వీధిలైన్ మీటర్లకు బిగించిన విద్యుత్ వైర్లు

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

కొత్తపల్లి: కొత్తమూలపేట గ్రామాన్ని ఆనుకుని ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. గృహాల్లో నివాసాలు ఉంటున్న, నిర్మాణాలు జరుగుతున్న గృహాలకు విద్యుత్ శాఖ అధికారులు లైన్లు ఇవ్వలేదు. దీంతో వీధిలైన్లకు సంబంధించి వేసిన మీటర్ ద్వారా తీగలు వేసి విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. వైర్లను స్తంభాలకు కట్టకుండా నేలపై నుంచే వేసుకున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవ్వరంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటించుకోవాల్సిన అధికారులే తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా నేలపై ఉన్న విద్యుత్ వైర్లు

ఫ్లై ఓవర్ కూడలిలో నిలిచిన లారీ



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో నిలిచిపోయిన వాహనాలు

- కిలోమీటర్ల పొడవునా నిలిచిన వాహనాలు
- ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశంలో లోడ్ లారీ సాంకేతిక లోపంతో నిలిచిపోవడంతో కిలోమీటర్ల పొడవున వాహనాలు బారులు తీరాయి. శనివారం ఆయా ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగకు వచ్చిన వారు కార్లు, మోటారుపైకిళ్లు, బస్సుల్లో తిరుగు ప్రయాణానికి సిద్ధమవడంతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. వాహనాల సంఖ్య పెరిగింది. ఈ సమయంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై లారీ నిలిచిపోవడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి బస్సు కాంప్లెక్స్ మీదుగా మఠంసెంటర్ వరకు, పెద్దాపురం ఏడీబీ రోడ్డులో రిలయన్స్ పవర్ ప్లాంటు వరకు, కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వరకు, ద్వారపూడి రోడ్డులో హుస్సేన్‌పురం వరకు వాహనాలు నిలిచిపోయాయి. నాలుగు రోడ్లలోను కిలోమీటర్ల పొడవున వాహనాలు బారులు తీయడంతోపాటు ఎవరికి వారే ముందు వెళ్లడానికి ప్రయత్నాలు చేయడంతో ట్రాఫిక్ సమస్య జటిలం అయింది. సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తమ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశంలో నిలిచిపోయిన లారీని క్రైన్ సహాయంలో పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని పెట్రోల్ బంకు వద్దకు తీసుకుపోవడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అవకాశం ఏర్పడింది.



క్రేన్‌తో లారీని తరలిస్తున్న దృశ్యం

టీడీపీ నేతలు ఎన్టీఆర్ ఆశయాలను హరించేశారు!

ఎన్టీఆర్ విగ్రహం వద్ద మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆందోళన

పిఠాపురం: టీడీపీ నేతలు ఎన్టీఆర్ ఆశయాలను హరించేశారని మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు డాక్టర్ ఎస్.సూర్యనారాయణ విమర్శించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బంగారమ్మ తల్లి రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం ఒక కలం పోటుతో మద్యపానాన్ని నిషేధించిన ఎన్టీఆర్‌కి జోహార్లు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కలలుగన్న మద్య రహిత సమాజ స్థాపనకి ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం అధికార కూటమి పాలకులు ఎన్టీఆర్ బొమ్మల దగ్గర భజనలు చేస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ ఆశలను, ఆశయాలను గాలికి వదిలేశారని ఆయన విమర్శించారు. ఎన్టీఆర్ నివాళులర్పించడం అంటే సంపూర్ణ మద్యపానం నిషేధమే ఆయన అన్నారు. దశల వారీగా మద్యాన్ని నిషేధించాల్సింది పోయి, రోజురోజుకి మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు కరణం విశ్వనాథం, భాస్కర ఆచార్యులు, వనపర్తి సూర్యనారాయణ, వేమగిరి తరుణ్, కొయ్యల రమణ, పప్పుల వీరబాబు, ఈగల త్రిమూర్తులు, కె.అప్పారావు, డి.సత్యనారాయణరెడ్డి, ఎస్ఎఫ్ఐ సిద్దు, మిరియాల చంటి, వరద వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ ఆందోళన

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర పంటలు

- రైతులు ప్రకృతి వ్యవసాయానికి సహకరించాలి
- ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజర్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజర్

పిఠాపురం: రైతులు సేంద్రియ సాగు చేసేందుకు ముందుకు రావాలని తద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యత గల పంటలను పొందవచ్చని కాకినాడ జిల్లా పకృతి వ్యవసాయ శాఖ డీపీఎం జెలియాజర్ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం పోసిన సతీష్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో జిల్లాప ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న ఎస్ఎఫ్ఏలు, ఎంటీలు, ఎంటీఏల్‌లు, మోడల్ మేకర్స్, డీఎంఎంటీలు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీపీఆర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో రైతు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పురుగులు తెగుళ్ల యాజమాన్య, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. రైతు స్థాయిలో ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్ ఏ విధంగా వేయాలి అనే విషయాలను వివరించారు. ముఖ్యంగా తక్కువ నీరుతో డ్రై ప్యాడీ ఏవిధంగా వేయాలి అనే దాని గురించి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రసాయనాలు ఎరువులు క్రిమిసంహారక మందులు వాడకం పెరిగిందని వాటిని నివారించడంతో పాటు ఎటువంటి రసాయనక పదార్థాలు లేని ఆరోగ్యవంతమైన పంటలు పండించే విధంగా పకృతి వ్యవసాయం పెంచే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రైతులు సేంద్రియ సాగుకు ముందుకు రావాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యత గల పంటలను పండించడంతోపాటు మంచి ఆదాయాన్ని పొందవచ్చని ఆయన అన్నారు. పకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వాటిని సిబ్బంది రైతుల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి కూడా సారవంతంగా మారుతుందని తద్వారా తక్కువ పెట్టుబడితో పంటలు పండించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రతో గ్రామాల శుభ్రత

సామర్లకోట: ఆరోగ్యవంతమైన గ్రామాలను తయారు చేయడానికి ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ కలెక్టరు భావన తెలిపారు. స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పి.వేమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్పతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో మార్పు రావాలని పిలుపు నిచ్చారు. ప్రతి గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డులు చెత్తతో నిండి పోవడంతో చెత్త నుంచి సంపద యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. పి.వేమవరం గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి,ఎంపీడీఓ కె.హిమామహేశ్వరీ, గ్రామ సర్పంచ్ ఎలిశెట్టి నూక రత్నం, మాజీ ఉపసర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొర, ఈఓపీఆర్డీ భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, అదే విధంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోను స్వచ్ఛ-దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛ- దివాస్ ప్రతిజ్ఞలో మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పి.వేమవరంలో స్వచ్ఛ-దివస్ ప్రతిజ్ఞలో అసిస్టెంట్ కలెక్టరు, ఎమ్మెల్యే తదితరులు



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, రైల్వే మేనేజరు తదితరులు

పరిసరాలు పరిశుభ్రతతోనే స్వచ్ఛ-దివస్ సాధ్యం

సామర్లకోట: ప్రతి ఒక్కరూ తాము ఉంటున్న ప్రదేశాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడటమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ-దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ-దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ తరుచూ స్వచ్ఛ భారత్‌పై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయినా ప్రజలలో మార్పు రాక పోవడం బాధగా ఉందన్నారు. ఇళ్ల వద్ద చెత్త సేకరణకు మున్సిపల్ వాహనాలు వస్తూ ఉన్నా చెత్తను డ్రైనులో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న టాక్సీస్టాండ్, ఆటో స్టాండ్ డ్రైవర్లు, రైల్వే కార్మికులతో స్వచ్ఛ-దివాస్‌పై కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ సెక్షన్ ఇంజినీరు(వర్క్స్) రవికాంత్, హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు మహేష్, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, రైల్వే ఉద్యోగులు, కార్మికులు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది, టాక్సీ, ఆటోయూనియన్ల ప్రతినిధులు పాల్గొన్ని శ్రమ దాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా మఠం సెంటర్‌లో నిర్వహించిన స్వచ్ఛ-దివాస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

కొత్తపల్లి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ రవికుమార్ అన్నారు. కొమరగిరి పంచాయతీ పరిధిలోని బీచ్‌రోడ్డులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో ఈఓపీఆర్డీ సత్యకృష్ణారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. బీచ్‌రోడ్డులో ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ నూకరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

- స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్డీఓ కార్యాలయ పరిసరాలను కార్యాలయ సిబ్బందిచే శుభ్రం చేయించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. స్వచ్ఛమైన పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం పొందవచ్చన్నారు. అనంతరం స్వచ్ఛ అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాదవరావు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ దివస్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

నిధుల దుర్వినియోగం

- వివాదాస్పదంగా శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం
- విచారణ చేయాలంటూ మూలపేట గ్రామస్తుల ఫిర్యాదు



శ్మశాన వాటికలో నిర్మించిన ప్రహరీ



గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మూలపేటలో విచారణ నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ సత్యకృష్ణారెడ్డి

కొత్తపల్లి: మూలపేట సెంటర్ సమీపంలో ఉన్న శ్మశాన వాటికకు నిర్మించిన ప్రహరీ వివాదాస్పదంగా మారింది. గ్రామంలోని 8 కులాలకు సంబంధించిన వారు ఇంటింటికీ చందాలు వేసుకుని నిర్మించుకున్న ప్రహరీని గ్రామ సర్పంచ్ పంచాయతీ నిధులతో నిర్మించారని బిల్లులు పెట్టుకుని నిధులు దుర్వినియోగం చేశారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గత కొన్ని రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించినట్టు ఈఓపీఆర్డీ సత్యకృష్ణారెడ్డి తె. గ్రామస్తులందరూ నిర్మించుకున్న శ్మశాన వాటిక ప్రహరీని పంచాయతీ నిధులు నిర్మించినట్టు చెప్పుకుని సుమారు రూ.9.25లక్షలు దుర్వినియోగం చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అంతేకాకుండా గ్రామంలో సుమారు సుమారు రూ.49లక్షల పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో గ్రామస్తులు పేర్కొనట్టు ఆయన తెలిపారు. ప్రహరీ నిర్మాణంపై పంచాయతీ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు. సర్పంచి కంబాల మాణిక్యను వివరణ కోరగా ప్రహరీ నిర్మాణానికి పంచాయతీలో తీర్మానం చేసి నిర్మించామన్నారు.